సాక్షి రంగారెడ్డి
బుధవారం, 23, ఏప్రిల్, 2025



దోపిడీదారులపై చర్యలు

ఫార్మాసిటీలో అక్రమంగా పరిహారం పొంది న దోపిడీదారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 10లో▸



నేలకూలిన హోర్డింగ్

ఈదురుగాలులతో కూడిన వర్షానికి కడ్తాల్‌లో జాతీయ రహదారి పక్కన రేకుల షెడ్డు, ఓ హోర్డింగ్ కుప్పకూలింది. 10లో▸



కలెక్టర్‌కు వినతి..

మంచాల మండల పరిధిలో నెలకొన్న భూ సమస్యలకు పరిష్కారం చూపాలని సీపీఎం నాయకులు కోరారు. 10లో▸

న్యూస్‌రీల్

సివిల్స్‌లో సత్తా

ఇంద్రార్చితకు 739వ ర్యాంకు



షాద్‌నగర్: సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాల్లో షాద్‌నగర్ విద్యార్థిని సత్తా చాటారు. పట్టణానికి చెందిన రాఘవేందర్ పడుకొనె, మమత దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో చిన్న కూతురు ఇంద్రార్చిత మంగళవారం విడుదలైన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో 739వ ర్యాంకు సాధించింది. ఇంద్రార్చిత తండ్రి షాద్‌నగర్‌లో ఓ బేకరీ నిర్వహిస్తున్నారు. ఇంద్రార్చిత షాద్‌నగర్‌లోని హెరిటేజ్ వ్యాలీ పాఠశాలలో 1నుంచి పదో తరగతి చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఆఫ్ ఉమెన్స్‌లో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. అక్కడి నుంచి ఇగ్నో యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివారు. పబ్లిక్ సర్వీస్ పట్ల ఆసక్తి పెంచుకున్న ఆమె ఢిల్లీలో కోచింగ్ తీసుకుని సివిల్స్‌కు సిద్ధమయ్యారు. ఆరో ప్రయత్నంలో లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇంద్రార్చిత సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై పట్టణ ప్రజలు, బంధువులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

బడంగ్‌పేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీటింగ్ హాలులో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు. రైతులు, ప్రజలు, భూ యజమానులు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

మోకిల పోలీసుల అదుపులో అఘోరీ

శంకర్‌పల్లి: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన అఘోరీ (శ్రీనివాస్)ని మంగళవారం మోకిల పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. అఘోరీ తనకు మాయమాటలు చెప్పి రూ.9.80 లక్షలు తీసుకుని, మోసం చేసిందంటూ ఫిబ్రవరి 25న ఓ మహిళ మోకిల పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉత్తరప్రదేశ్‌లో అఘోరీని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. బుధ, గురువారాల్లో ఇక్కడికి తీసుకువచ్చి విచారణ చేయనున్నట్లు తెలిసింది.

ఫస్టియర్ 76.95%

సెకండియర్ 77.72%

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

- 2024తో పోలిస్తే 2025లో తగ్గిన ఉత్తీర్ణత శాతం
- ప్రథమ సంవత్సరంలో ఒకటి నుంచి రెండో స్థానానికి..
- ద్వితీయ సంవత్సరంలో మూడు నుంచి నాలుగో స్థానానికి పడిపోయిన ర్యాంకు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో 76.95 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలవగా, సెకండియర్‌లో 77.72 శాతం ఉత్తీర్ణతతో నాలుగో స్థానంలో నిలిచింది. గతంతో పోలిస్తే ఫలితాల శాతం కొంత తగ్గినప్పటికీ ఇతర జిల్లాలతో పోలిస్తే ఉత్తమ ఫలితాలు సాధించింది. ఫస్ట్, సెకండియర్ ఫలితాల్లో ఎప్పటిలాగే ఈసారి కూడా బాలికలదే హవా కొనసాగింది. ప్రైవేటు కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ మార్కులు సాధించిన వారిలో ఆటోడ్రైవర్, దినసరి కూలీల పిల్లలు సైతం ఉన్నారు. ఇక జనరల్ విద్యార్థులతో పోలిస్తే..ఒకేషనల్ విద్యార్థులు ఈసారి కొంత ముందంజలో ఉన్నారు.



ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన శ్రీవార్షికను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

మొదటిలో రెండో స్థానం

- ఫస్టియర్ జనరల్‌లో మొత్తం 76,967 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 59,227 మంది ఉత్తీర్ణత (76.95శాతం) సాధించారు. వీరిలో 39,503 మంది బాలురకు 28,537 మంది (72.24 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 37,464 మంది పరీక్షకు హాజరు కాగా 30,690 మంది ఉత్తీర్ణత (81.92 శాతం) సాధించారు.
- ఒకేషనల్ కోర్సులో 3,445 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 2,179 మంది ఉత్తీర్ణత (63.25 శాతం) సాధించారు. బాలురు 1,736 మంది పరీక్షకు హాజరుకాగా, వీరిలో 834 మంది ఉత్తీర్ణత (48.04 శాతం) సాధించారు. బాలికలు 1,709 మంది పరీక్షకు హాజరు కాగా 1,345 మంది ఉత్తీర్ణత (78.70శాతం) సాధించారు.

ద్వితీయంలో నాలుగో స్థానం

- సెకండియర్ జనరల్ కోర్సుల్లో మొత్తం 67,586 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 52,526 మంది ఉత్తీర్ణత (77.72 శాతం) సాధించారు. 34,884 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా 25,711 మంది ఉత్తీర్ణత (73.70 శాతం) సాధించారు. 32,702 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా 26,815 మంది ఉత్తీర్ణత (82 శాతం) సాధించారు.
- ఒకేషనల్ కోర్సుల్లో 2,995 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 2,195 మంది ఉత్తీర్ణత (73.29 శాతం) సాధించారు. బాలురు 1,521 మంది పరీక్షకు హాజరుకాగా 901 మంది ఉత్తీర్ణత (59.24 శాతం) సాధించారు. బాలికలు 1,474 మంది పరీక్షకు హాజరుకాగా 1,294 (87.79 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఫస్టియర్ జనరల్ విద్యార్థుల ఉత్తీర్ణత

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం	ర్యాంకు
2024	71,297	51,121	71.7	1వ
2025	76,967	59,227	76.95	2వ

సెకండియర్ జనరల్ విద్యార్థుల ఉత్తీర్ణత

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం	ర్యాంకు
2024	64,759	50,273	77.63	3వ
2025	67,586	52,526	77.72	4వ

ఫస్టియర్ ఒకేషనల్ విద్యార్థుల ఉత్తీర్ణత

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2024	3,580	1,819	50.92
2025	3,445	2,179	63.25

సెకండియర్ ఒకేషనల్ విద్యార్థుల ఉత్తీర్ణత

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2024	3,094	1,919	62.02
2025	2,995	2,195	73.29



భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు

'భూ భారతి' విప్లవాత్మక మార్పు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

మంచాల: భూ భారతి చట్టం తేవడం విప్లవాత్మక మార్పు అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా భూ సమస్యలతో సతమతవుతున్న రైతులకు భూభారతి చట్టం ఎంత మేలు చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గతంలో ధరణి ద్వారా కనీసం రికార్డుల్లో తప్పులను కూడా సరి చేసుకోలేని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు తిరిగి తలెత్తకుండా కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ సందర్భంగా కొంత మంది రైతులు తమ భూ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం మంచాలలో డీసీసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో భూభారతి చట్టం చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆర్డీఓ అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మంచాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.వీ.ప్రసాద్, ఎంపీడీఓ బాలశంకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై కొరడా

మీర్‌పేట: ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి దుర్వినియోగానికి పాల్పడిన ఓ ప్రైవేటు ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలోని హిరణ్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం కొంత కాలంగా ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి తప్పుడు బిల్లులతో అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై వైద్య శాఖ విచారణ చేపట్టింది. ఈ మేరకు మంగళవారం జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఇతర అధికారులతో కలిసి ఆస్పత్రిని సీజ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి గీత ఉన్నారు.

కేసులు నమోదు చేసి విచారణ..

హుడాకాంప్లెక్స్: తప్పుడు వైద్య బిల్లులు సృష్టించి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి పొందిన ప్రైవేటు ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కొరడా ఝులిపించింది. సరూర్‌నగర్ మండల పరిధిలోని ఎంఎంఎస్, ఇందిరా ఆస్పత్రులను మంగళవారం జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు సీజ్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటికే ఆయా ఆస్పత్రులపై ప్రభుత్వం కేసులు నమోదు చేసి విచారణ చేపట్టిందని అన్నారు.



బాలాపూర్ చౌరస్తాలోని ఓ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న జిల్లా అధికారులు

మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఇబ్రహీంపట్నం: మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం పాష నరహరి స్మారక కేంద్రంలో మంగళవారం పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడే ఉత్సవాలను గ్రామగ్రామాన పెద్దఎత్తున నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. రామోజీ ఫిలింసిటీలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూములకు తక్కువ పరిహారం చెల్లించారని.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. అనాజ్‌పూర్‌లో 125 మంది రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు బి.సామేల్, చంద్రమోహన్, కందుకూరి జగన్, జగదీశ్, కవిత, బుగ్గరాములు, సీహెచ్ జంగయ్య, కిషన్, నర్సింహ, పి.జంగయ్య పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి ఆశయసాధనకు కృషి



కౌకుంట్లలోని ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సబితారెడ్డి, కుటుంబసభ్యులు, నాయకులు, అభిమానులు

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: స్వర్గీయ హోంశాఖ మంత్రి పి.ఇంద్రారెడ్డి ఆయశ సాధనకు నిరంతరం కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా మండలంలోని కౌకుంట్లలో మంగళవారం ఆయన సమాధి వద్ద ఆమె కుమారులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి వారసురాలిగా రాజకీయంలోకి వచ్చిన తనకు 25 ఏళ్లుగా అండగా ఉంటూ ముందుకు నడిపిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, అభివృద్ధి, ఈప్రాంత సమస్యల పరిష్కారమే ఇంద్రారెడ్డి ఆశయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, శుభప్రద్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్‌వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని జీరో చేశారు

ఇంద్రారెడ్డి వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న సబితారెడ్డి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణను కేసీఆర్ నంబర్ వన్ స్థానంలోకి తీసుకెళ్లారని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జీరోస్థాయికి దిగజార్చారని మండిపడ్డారు. పరిస్థితి ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని మళ్లీ కేసీఆర్, బీఆర్ఎస్ పాలన రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ నెల 27 వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిధులు లేక.. పనులు సాగక



షాబాద్ పంచాయతీలో వెలగని వీధిలైట్లు



'ఇది కేశంపేట మండలంలోని ఓ మారుమూల పంచాయతీ. ఇక్కడ సుమారు 500 మంది జనాభా ఉంది. మిషన్ భగీరథ పైపులైన్లు దెబ్బతిన్నాయి. చాలాచోట్ల పైపులు మూసుకుపోవడంతో ఇంట్లోకి నీరు చేరని పరిస్థితి. బోరు నీరు సరఫరా చేయాలన్నా మోటార్లు పని చేయడం లేదు. మరమ్మతులకు జీపీలో కనీస నిధులు కూడా లేవు. విధిలేని పరిస్థితుల్లో ఔట్ సోర్సింగ్ కార్యర్శి సొంత ఖర్చుతో కంప్రెషన్ మిషన్ తెప్పించి పైపులైన్లను రిపేరు చేయించాల్సి వచ్చింది'.

'ప్రస్తుతం ఎండలు భగ్గున మండుతున్నాయి. భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. కరెంట్ సరఫరాలో హెచ్చుతగ్గులు, తరచూ తలెత్తుతున్న సాంకేతిక సమస్యలతో మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షాలకు వీధిలైట్లు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఏ వీధిలో చూసినా అంధకారమే నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో మోటారు రిపేరు చేయించాలంటే కనీసం రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కాలిపోయిన వీధిలైటు స్థానంలో కొత్తగా మరోటి వేయించాలంటే కనీసం రూ.500 నుంచి రూ.1000 వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ట్రాక్టర్ నెలవారీ డీజిల్ ఖర్చు రూ.3వేల వరకు వస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏడు నెలలుగా పైసా రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీలను ఎలా నెట్టుకురావాలి' ఇదీ ఓ ఔట్ సోర్సింగ్ కార్యదర్శి ఆవేదన.

- పడకేసిన పల్లెపాలన
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- వెలగని వీధిలైట్లు.. తాగునీటికి తండ్లాట
- నత్తనడకన అభివృద్ధి పనులు
- నిధులు విడుదల చేయని ప్రభుత్వాలు
- కరువైన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సర్పంచుల పదవీకాలం ముగియడం.. 14 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండడం.. 15వ ఆర్థికసంఘం నుంచి ఏడు నెలలుగా నిధులు రాకపోవడం.. ఆస్తి పన్నుల రూపంలో వసూలు కావాల్సిన మొత్తం ఆశించినస్థాయిలో రాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది.

ఖర్చులకు.. రాబడికి పొంతనేది?

జిల్లా వ్యాప్తంగా 558 పంచాయతీలు, 307 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఇటీవల వీటిలో కొన్ని సమీప మున్సిపాలిటీల్లో విలీనం కాగా, మిగిలినవి ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 252 మంది గెజిటెడ్ స్థాయి అధికారులను రెండు మూడు గ్రామాలకు ఒకరు చొప్పున ప్రత్యేకాధికారులుగా నియమించింది. ఆయా గ్రామాల పరిధిలో 1,722 కిలోమీటర్ల మేర డ్రైనేజీ వ్యవస్థ ఉండగా, వీటిలో 210 కిలోమీటర్లు ఓపెన్ డ్రైనేజీ, 1,320 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 192 కిలోమీటర్లు కచ్చ డ్రైనేజీ ఉంది. 1,631 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా,17,536 వాటర్ సంపులు ఉన్నాయి. 2,52,252 నివాసాలకు తాగునీరు సరఫరా అవుతోంది. 3,204 పబ్లిక్ నల్లాలు ఉన్నాయి. 536 నర్సరీల్లో 32,57,458 మొక్కలు పెంచుతున్నారు. 865 పల్లె ప్రకృతి వనాలు ఉండగా, వీటిలో 17,44,993 మొక్కలు నాటారు. 253 డంపింగ్ కేంద్రాలు, 557 వైకుంఠధామాలు ఉన్నాయి. ఆయా పంచాయతీల నుంచి ఆస్తిపన్నుల రూపంలో 2022–24 ఆర్థిక సంవత్సరంలో రూ.32.69 కోట్లు రావాల్సి ఉండగా, రూ.28.15 కోట్లు మాత్రమే సమకూరాయి. 15వ ఆర్థిక సంఘం నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.104.54 కోట్ల గ్రాంటు విడుదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పాటు ఆస్తి పన్నుల రూపంలో ఆయా పంచాయతీలకు వస్తున్న ఆదాయానికి.. క్షేత్రస్థాయి ఖర్చులకు.. వస్తున్న రాబడికి ఏమాత్రం పొంతన కుదరడం లేదు. ఏడు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణ అధికారులకు భారంగా మారింది.

చేయలేక.. చేతులు చాచలేక..

రోడ్లు, డ్రైనేజీల వంటి అభివృద్ధి పనులకే కాదు కనీసం ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చులు, వీధిలైట్ల కొనుగోలు, మంచినీటి మోటార్లకు వచ్చే చిన్నచిన్న రిపేర్లకు సైతం చేతులు చాచాల్సి వస్తోంది. ఖర్చులకు ఖాతాలో డబ్బులు లేక అప్పులు చేయాల్సి వస్తోంది. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న పంచాయతీల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. వారికి నాలుగు నెలల వేతనం బకాయి పడడం, ఇస్తున్న వేతనం కూడా చాలా తక్కువగా ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో చేతులెత్తేస్తున్నారు. నెలవారీ ఖర్చులు భారమవుతుండటంతో ఇప్పటికే పలువురు ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు ఉద్యోగం మానేశారు. సర్పంచులు పదవుల్లో కొనసాగినప్పుడు ఖర్చులను సర్దుబాటు చేసేవారు. గ్రామంలో పేరు కోసం సొంత డబ్బులు వెచ్చించేవారు.

చీకట్లోనే మెజార్టీ పంచాయతీలు

ఇటీవల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు చాలాచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వీధిలైట్లు దెబ్బతిన్నాయి. పాడైన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు జీపీల వద్ద కనీస నిధులు లేవు. ఆయా వీధులన్నీ అంధకారంలోనే మగ్గాల్సి వస్తోంది. ట్రాక్టర్ డీజిల్‌కు నిధులు లేక పల్లె ప్రకృతి వనాల్లోని చెట్లకు నీరు పోయలేని పరిస్థితి. చాలా చోట్ల మొక్కలు వాడిపోయి కన్పిస్తున్నాయి. విధిలేని పరిస్థితుల్లో కొంత మంది కార్యదర్శులు అప్పులు చేసి తాత్కాలిక పరిష్కారం చూపుతుంటే.. మరికొంత మంది అటువైపు వెళ్లడానికే వెనకడుగు వేస్తున్నారు.

ఇళ్లలో ఉండలేక పోతున్నాం



మా గ్రామంలో ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు తెగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా చీకట్లోనే కాలం వెళ్లదీసాం. కనీసం ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరు. ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇళ్లలో ఉండలేకపోతున్నాం.

– నర్సింగ్ వెంకటయ్య, లోయపల్లి, మంచాల మండలం

ఇళ్లలోకి మురుగు నీరు



గ్రామంలో నాలుగు వాన చినుకులు వస్తే చాలు కష్టాలు ఎదురైనట్లే. వర్షాలకు అండర్‌డ్రైనేజీ వాల్వ్‌లో మురుగు నీరు నిండి ఇళ్లలోకి వస్తున్నాయి. ఏళ్ల తరబడి మురుగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదు.

– మాతంగి కమలమ్మ, లోయపల్లి, మంచాల మండలం

ఇంటర్‌లో మెరిసారు..

- 995 మార్కులు సాధించిన పల్లవి
- ఇంటర్ బైపీసీలో స్టేట్ ర్యాంక్


తల్లి పుష్పతో పల్లవి

ఆమనగల్లు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో గిరిపుత్రిక ఇస్లావత్ పల్లవి సత్తా చాటింది. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన ఇస్లావత్ పల్లవి బైపీసీ సెకండియర్‌లో 995 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయి ర్యాంకు దక్కించుకుంది. తల్లిదండ్రులు ఇస్లావత్ జానునాయక్, పుష్ప దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు సంతానం. పెద్ద కూతురు నవీన బీటెక్ ఫైనల్ ఇయర్, కొడుకు అరవింద్ ఎంబీబీఎస్ థర్డ్ ఇయర్ చదువుతున్నారు. తమ సోదరి ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటడంపై హర్షం చేశారు.

డాక్టర్ అవుతా..

భవిష్యత్తులో డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని పల్లవి చెప్పారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, అధ్యాపకులు అందించిన ప్రోత్సాహంతోనే మంచి మార్కులు సాధించానని తెలిపారు. డాక్టరై ప్రజలకు సేవలు అందించాలని భావిస్తున్నట్లు పల్లవి వెల్లడించారు.

రైతుబిడ్డకు స్టేట్ ర్యాంక్

శంకర్‌పల్లి: పట్టణంలోని వివేకానంద కళాశాలకు చెందిన ఎల్.నందినిరెడ్డి ఇంటర్ ఎంపీసీ సెకండియర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంక్ సాధించింది. 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించి శభాష్ అనిపించుకుంది. వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం మైతాబ్‌ఖాన్ గూడ వీరి స్వగ్రామం. తల్లిదండ్రులు నర్సింహారెడ్డి, సునీత వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నిత్యం ఆర్టీసీ బస్సులో శంకర్‌పల్లికి వచ్చి చదువుకున్న నందిని అత్యుత్తమ మార్కులు సాధించడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నందినిరెడ్డి, ఎంపీసీ 992

సత్తాచాటిన 'సర్వేల్' విద్యార్థి


అరింధమ్

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో నల్లగొండ జిల్లా చౌటుప్పల్ పరిధిలోని సంస్థాన్‌నారాయణపూర్ సర్వేల్ గురుకుల కళాశాలలో చదువుతున్న నగరానికి చెందిన విద్యార్థి అరింధమ్ మరపట్ల ఫస్టియర్ ఇంటర్‌లో (ఎంపీసీ) 470 మార్కులకు గాను 465 మార్కులతో రాష్ట్రస్థాయిలో నాలుగవ ర్యాంకు సాధించాడు. ఈ మేరకు కళాశాల యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

హత్య కేసులో నిందితుల అరెస్టు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధి లింగారెడ్డిగూడ గ్రామ శివారులోని ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో ఇటీవల జరిగిన హత్య కేసులో మరో ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 12న ఏపీలోని నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం దేవులపురం గ్రామానికి చెందిన సాయి రాహుల్(23)ను లింగారెడ్డిగూడ గ్రామ శివారులో హత్య చేశారు. ఈ కేసులో ఈ నెల 19న వెంకటేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు ఏపీలోని ఆళ్లగడ్డకు చెందిన ప్రతాప్ అలియాస్ చిన్న, హైదరాబాద్ గోల్నాకకు చెందిన చందును హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్‌స్టాండ్‌లో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆస్పత్రి యాజమాన్యంపై ఫిర్యాదు

యాచారం: మండల పరిధి మాల్ కేంద్రంలోని పీపుల్స్ ఆస్పత్రి యాజమాన్యంపై మంగళవారం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది పగుడాల శ్రీశైలం డీఎంహెచ్‌ఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన తమ కుటుంబ సభ్యుడిని ఆస్పత్రికి తీసుకెళ్తే సరైన వైద్య చికిత్స అందించక పోగా.. అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఆయన ఆరోపించారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇదే విషయమై ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ భాస్కర్‌ను వివరణ కోరగా.. శ్రీశైలం కుటుంబ సభ్యులపై ఎలాంటి వివక్ష చూపించలేదని తెలిపారు.

కొడుకు మందలించాడని..
పురుగు మందు తాగిన తండ్రి చికిత్స పొందుతూ మృతి

మొయినాబాద్: కొడుకు మందలించాడని మనస్తాపానికి గురైన తండ్రి పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొడ్డె సుదర్శన్(66) ఈ నెల 17న మల్లన్న జాతర సందర్భంగా గంగతెప్ప తేవడానికి వెళ్లి.. తాగిన మత్తులో కారును పాడు చేశాడు. దీంతో అతని కొడుకు శ్రీశైలం తండ్రిని మందలించాడు. మనస్తాపానికి గురైన సుదర్శన్.. అదే రోజు రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. ఈ విషయాన్ని కుమారుడికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం స్థానిక భాస్కర ఆసుపత్రికి తరలించారు. 18న మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి 20న నిమ్స్‌కి మార్చారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఫార్మా' దోపిడీదారులపై చర్యలు

- అక్రమంగా పొందిన పరిహారం రికవరీ చేస్తాం
- ఫార్మాసిటీని రద్దు చేసి, ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం
- భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న ఫార్మా భూబాధిత రైతులు

యాచారం: ఫార్మాసిటీలో అక్రమంగా పరిహారం పొందిన దోపిడి దారులపై చర్యలు తప్పవని, నకిలీ పేర్లతో స్వాహా చేసిన డబ్బును రికవరీ చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండల కేంద్రంలో మంగళవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రధాన సమస్య ఫార్మాసిటీ ఉండేదని, రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చాక దానిని రద్దు చేసి, ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో దేశం మొత్తం ఇబ్రహీంపట్నం, మహేశ్వరం వైపే చూస్తుందన్నారు. ఫార్మాకు భూములిచ్చిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో అసైన్డ్ రైతులకున్న పట్టాదారు, పాసుపుస్తకాల్లో ఉన్న ఎకరాల కంటే తక్కువగా పరిహారం ఇచ్చారని, దానిని ఆసరా చేసుకున్న కొందరు.. అధికారుల అండతో రూ.కోట్ల పరిహారం కాజేశారని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో ఫార్మా ప్లాట్లకు కబ్జాలు చూపించి రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పారు. ఫ్యూచర్‌సిటీకి రైతులు సహకరించాలని కోరారు.

న్యాయపరంగానే..

ఫార్మాసిటీకి భూములు ఇవ్వలేదన్న సాకుతో గత ప్రభుత్వం.. రైతులపై కక్షగట్టి, వారి పట్టా భూముల రికార్డులను రాత్రికిరాత్రే టీజీఐఐసీ పేరిట మార్చి, పరిహారం డబ్బును అథారిటీలో జమ చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రస్తుతం ఆ సమస్య న్యాయస్థానం పరిధిలో ఉందని, న్యాయపరంగానే న్యాయం చేస్తానని బాధిత రైతులకు భరోసా ఇచ్చారు. ఆ భూముల వైపు అధికారులు రారని హామీ ఇచ్చారు. భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ధరణి పోర్టల్ లోసుగులతో యాచారం మండలంలోని అనేక గ్రామాల్లో భూదాన్, సీలింగ్ భూముల రికార్డులు మార్చి, అనేక అక్రమాలు చేయడంతో పాటు ఫార్మాసిటీలో 200 ఎకరాలకు పైగా పరిహారం కాజేశారన్నారు. అప్పట్లో అక్రమాలకు పాల్పడిన అధికారులపై కూడా చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్యే వస్తున్నారన్న సమాచారంతో ఫార్మా భూబాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రైతులతో మాట్లాడి శాంతింపజేశారు. ఎమైనా సమస్యలుంటే ఎమ్మెల్యేకు తెలపాలని గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు సూచించారు. దీంతో వారి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే.. మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీలు రాంరెడ్డి, శ్రీనువాస్‌రెడ్డి, రామకృష్ణ, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రోఖర్ రెడ్డి, నాయకులు అమృతసాగర్, తహసీల్దార్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం


కుల్కచర్ల: తిర్మలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిర్మలాపూర్, ఇప్పాయిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగొలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, బ్లాక్–బి అధ్యక్షుడు భరత్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు జంగయ్య, ప్రకాష్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, రాంచంద్రయ్య, ఉమాశంకర్, ఆనందం పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దోమ: రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామంలో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

స్థాయి పెంచరు.. సేవలందించరు

- దౌల్తాబాద్ పీహెచ్‌సీ దుస్థితి
- 24 గంటలు వైద్య సేవలు ఉండాలని స్థానికుల వేడుకోలు


దౌల్తాబాద్ పీహెచ్‌సీ

దౌల్తాబాద్: ప్రభుత్వ వైద్యం రోగులకు పూర్తిస్థాయిలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో 12 గంటల పీహెచ్‌సీ మాత్రమే ఉండంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. దీంతో గత్యంతరం లేక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఇక్కడ ఉన్న పీహెచ్‌సీని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడంలేదు.

20 ఏళ్ల క్రితం ప్రారంభం

దౌల్తాబాద్‌లో 20 ఏళ్ల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో 12 గంటల ఆస్పత్రిగా మంజూరు చేశారు. ఇప్పటికీ అదే స్థాయిలో కొనసాగుతుంది. ప్రస్తుతం దౌల్తాబాద్ పీహెచ్‌సీ కర్ణాటక సరిహద్దున ఉంది. మండలంలో చాలా తండాలున్నాయి. అలాగే 33 గ్రామ పంచాయతీలున్నాయి. వాటి పరిధిలోని ప్రజలకు ఏదైనా ఆరోగ్య పరంగా సమస్య వస్తే పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తుంది. 12 గంటల పాటే ఆస్పత్రి ఉండడంతో అవస్థలు పడుతున్నారు. ఎవరికైనా అత్యవసర వైద్య సేవల అవసరం ఉంటే గత్యంతరం లేక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తున్నారు. ఫలితంగా జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

సేవలకు సమయం అడ్డంకి

ఇక్కడి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు, కాంట్రాక్ట్ బేసిక్‌లో ఫార్మసిస్టు, స్టాఫ్‌నర్సు ఉన్నారు. రెగ్యులర్ ఏఎన్ఎం ఒకరు, 8 మంది కాంట్రాక్ట్ ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. వీరితో వైద్యసేవలను కొనసాగిస్తున్నారు. కానీ వీరందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే విధుల్లో ఉంటారు. మిగతా సమయంలో పీహెచ్‌సీ మూసి ఉంటుంది. కేవలం నాలుగు పడకల ఆస్పత్రిగానే ఉంది. నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు అత్యవసర సమయాల్లో వైద్యసేవలు అందడం కష్టంగా మారింది.

పట్టించుకోని పాలకులు

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలని మండల ప్రజలు కొన్నేళ్లుగా కోరుతున్నా ఇంతవరకు మోక్షం కలగడంలేదు. మండలానికి వచ్చిన మంత్రులకు చాలా రోజుల నుంచి విన్నవిస్తున్నా ప్రయోజనం లేదు. గత ప్రభుత్వంలో స్థానిక నాయకులు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావుకు వినతిపత్రం అందించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నారే తప్పా మంజూరు మాత్రం చేయడం లేదు. ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారని.. ఇప్పటికైనా 24 గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయించేలా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మంచాల: మండల పరిధి పలు గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలకు పరిష్కారం చూపాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. భూభారతి చట్టంపై అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌ను వారు కలిశారు. భూ సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, జిల్లా నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, పి.కృష్ణ, ఆవుల యాదయ్య, రైతుసంఘం నాయకులు కె.జంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజయ్ బాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అసత్య ప్రచారం.. వ్యక్తికి రిమాండ్

కడ్తాల్: ఫేస్ బుక్‌లో సీఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్‌కు చెందిన జంబులా పాండు రంగారెడ్డి అలియాస్ రంగయ్య తన ఫేస్‌బుక్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సీఎం రేవంత్‌రెడ్డి 26 జనవరి 2025లో చనిపోయాడని, రెస్ట్ ఇన్ పీస్ అంటూ ఈనెల 20న షేర్ చేశాడు. దీనిపై స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు

ధారూరు: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ధారూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన ఎల్.శ్రీనివాస్(35) స్పీకర్‌ను దూషిస్తూ.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఇది వైరల్ కావడంతో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాణిక్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిత తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



అబ్దుల్లాపూర్‌మెట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బాటసింగారం గ్రామ పంచాయతీ పరిధి దేశ్‌ముఖికి వెళ్లే దారిలో మంగళవారం మధ్యాహ్నం 1గంటల సమయంలో ఓ వ్యక్తి(35) అపస్మారక స్థితిలో పడున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పంచాయతీ కార్యదర్శి రాంబాబు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం 108కి సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు పరిశీలించి, అప్పటికే వ్యక్తి మృతిచెందినట్లు నిర్ధారించారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

పార్టీ బలోపేతానికి కృషి

మర్పల్లి: పేదల సంక్షేమం కోసం పాటు పడుతున్న కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేస్తుందన్నారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు నిఖిల్‌రెడ్డి, నాయకులు సాయిబాబా, మనోజ్‌కుమార్, శ్రీనివాస్, వసంత్, ప్రశాంత్, రాఖేష్, వీరారెడ్డి, లింగం, మహిపాల్ తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహా యాదవ్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

నందిగామ: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్ అన్నారు. మండల పరిధిలోని అంతిరెడ్డిగూడలో గత పదిరోజులుగా నిర్వహించిన ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంటు మంగళవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు నర్సింహాయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పవన్ విన్నర్ టీమ్, రన్నర్‌గా నిలిచిన చంటి టీమ్‌కు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు దేపల్లి కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు తుమ్మల జగన్‌యాదవ్, అంజీ యాదవ్, శ్రీశైలం, కృష్ణమోహన్, శ్రీనివాస్, యాదయ్య, లక్ష్మన్, రాజు, రమేశ్, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు.. నేలకూలిన హోర్డింగ్


మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం


కూలిన హోర్డింగ్

కడ్తాల్: మంగళవారం మండల కేంద్రంలో కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షంతో జాతీయ రహదారి పక్కన రేకుల షెడ్డు, ఓ హోర్డింగ్ కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగాయి. మామిడి తోటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన వారిని ఆదుకోవాలని రైతులు కోరారు.

ఆకట్టుకుంటున్న బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్


తన బయోలాజికల్ సెంటర్‌లో తయారు చేసిన ఎరువును ప్రదర్శిస్తున్న రైతు బ్రహ్మయ్య

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్‌లో నిర్వహిస్తున్న రైతు మహోత్సవం కర్షకుల్లో ఉత్సాహం నింపుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ మహోత్సవం బుధవారం ముగియనుంది. ఈ సమ్మేళనంలో రైతులు వివిధ అంశాలపై అవగాహన కలిగేలా ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. షాద్‌నగర్‌కు చెందిన రైతు నాదెండ్ల బ్రహ్మయ్య 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్' సంస్థ అందించిన సాంకేతిక మద్దతుతో దేశంలోనే మొట్టమొదటి 'బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్' నెలకొల్పారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఇలాంటి 3 వేల కేంద్రాలను ఈ విడతలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. బ్రహ్మయ్య ఏర్పాటు చేసిన రైతు స్థాయి బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్ ల్యాబ్‌లో పురుగులను చంపే, తెగుళ్లను నివారించే సూక్ష్మజీవులను అభివృద్ధి చేస్తున్నారు. పశువులు, జీవాల పేడ కలిపి ఎరువు తయారు చేస్తున్నారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇలాంటి యూనిట్లకు సాంకేతిక మద్దతు అందిస్తోంది. తమ ల్యాబ్‌లో తయారు చేస్తున్న ఎరువులు భూసారాన్ని కాపాడుతాయని బ్రహ్మయ్య తెలిపారు.